క్లుప్తంగా

ఐఎంఏ నూతన భవనానికి ప్రతిపాదన


కార్యక్రమంలో మాట్లాడుతున్న రవిరాజు

సాక్షి, భీమవరం : భీమవరంలో ఐఎంఏ నూతన భవనం రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించాలని అంచనా వేశారు. ఆంధ్ర మెడికల్ కళాశాల చదివిన భీమవరం ప్రాంత పూర్వ విద్యార్థులు ఆదివారం భీమవరం ఐఎంఏ హాల్లో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ టి.రవి రాజు అధ్యక్షత వహించారు. ఆనాటి విద్యార్థులందరూ మంచి వైద్యులుగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడి చక్కటి సేవలు అందిస్తున్న అంశం అందరూ ఆసక్తికరంగా చర్చించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలోడాక్టర్లు పి వి సుధాకర్, టి రాధా, విజయ్ శేఖర్, చీడే సత్యనారాయణ, యిర్రింకి సూర్యనారాయణ రావు, జీఆర్కే రాజు డాక్టర్, ఎ.రాధాకృష్ణం రాజు, పి ఆర్ కె వర్మ, డాక్టర్ బాలకృష్ణంరాజు, కుమార్ వర్మ పాల్గొన్నారు.

గాదిరాజు శ్రీరామరాజుకు ఘన నివాళి


గాదిరాజు శ్రీరామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాలకోడేరు: గాదిరాజు శ్రీరామరాజు జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కొనియాడారు. ఆదివారం అమరజీవి, ప్రజానాయకుడు, సీపీఎం నాయకులు గాదిరాజు శ్రీరామరాజు 32వ వర్ధంతి కార్యక్రమం ఆయన స్వగ్రామం గొల్లలకోడేరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరామరాజును స్మరిస్తూ సీపీఎం సీనియర్ నాయకుడు జుత్తిగా నరసింహమూర్తి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శేషపు అశ్రియ్య, మాజీ సర్పంచ్ గాదిరాజు వెంకట సత్య సూర్యనారాయణ, జేఎన్వి గోపాలన్, కె.క్రాంతి బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి పెద్దిరాజు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక పఠన పోటీలు


భగవద్గీత పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విశేష స్పందన వచ్చింది. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభించారు. జిల్లా నలుమూలనుంచి చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు భగవద్గీతను పఠిస్తున్నంత సేపు ఆహుతులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా యూకే విశ్వనాథరాజు మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు అందరికీ రావాలని, ప్రతీ ఒక్కరూ భగవద్గీత చదవాలనే అనే ఉద్దేశ్యంతో వయస్సు తో సంబంధం లేకుండా 5 సంవత్సరాల నుండి 80 సంవత్సరాలు వరకు రున్న వారికి కూడా పోటీలు నిర్వహస్తుమన్నామన్నారు. సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ భగవద్గీతను చదవడం వల్ల, ఆలపించడం వల్ల ముక్తిని పొంద వచ్చన్నారు. అనంతరం పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ప్రశంసాపత్రంతో పాటు భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాయన సురేష్ చంద్రజీ, కంతేటి వెంకట్రాజు, ఎన్టీఓ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంతోనే సమర్థవంతమైన పాలన

డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు.


చినకాపవరంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో గోడకు స్టిక్కర్ అంటిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సిహరాజు


ఉండిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సందర్భంగా సమావేశమైన వైఎస్సార్ సీపీ నాయకులు

ఆకివీడు: రాష్ట్రంలో సమర్థవంతమైన, అవినీతిరహిత పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంతోనే రాష్ట్ర భవిష్యత్, ప్రజల భవిష్యత్ ముడిపడి ఉందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని చినకాపవరం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన పీవీఎల్‌కు ప్రజలు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ భవిష్యత్‌లో పథకాలు కొనసాగాలన్నా, ప్రజలు, రాష్ట్రం అభివృద్ధిలో పయనించాలన్నా మళ్లీ జగన్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ట ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు, జీ.ధనరాజు, నంద్యాల సీతారామయ్య, నందమూరి సత్యవతి, సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మీ, అన్నవరం, భాస్కరరావు, కత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: మనందరి భవిష్యత్ జగనన్నే అని ఉండి వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు.ఆదివారం ఉండిలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ప్రతీ ఇంటికి ప్రయోజనం చేకూర్చిన మొట్టమొదటి ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని అన్నారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో ఉండిలో తప్పకుండా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్య, కమతం బెనర్జీ, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, కరిమెక చంద్రరావు, యేడిద వెంకటేశ్వరరావు, బడుగు బాలాజీ, సోము నాగమణి, కరిమెరక మల్లిఖార్జున, ఎంపీటీసీలు వీరమల్లు సత్యవతి, గిరడ రమణ,క రిమెరక శివనాగరాజు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలను మండల వ్యాప్తంగా ఆదివారం మూడో రోజుఅత్యంత వేడుకగా ఆయా గ్రామాల్లో ప్రారంభించారు. గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో కోలాహలంగా వాడవాడల కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నిత్యం స్పందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అంతా బాసటగా నిలవాలని కోరారు. వీరవాసరంతో పాటు రాయకుదురు, కొణితివాడ, మడుగు పోలవరం, నేలపోగుల, తోలేరు, అండలూరు, నవుడూరు, బలుసుగొయ్యిలపాలెం, పంజా వేమవరం, చింతలకోటి గరువు, వీరవల్లి వారి పాలెం, తోకలపూడి, వడ్డి గూడెం, మత్స్యపూరి మత్స్యపురిపాలెం ,తోకలపూడి, నందమూరి గరువు, పెరికిపాలెం, బొబ్బనపల్లి, మెంటేపూడి తదితర గ్రామాల్లో కార్యక్రమాలను గ్రామ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జేసీ ఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు, గొలగాని సత్యనారాయణ, గద్దం భారతి, చికిలే మంగతాయారు, పంజా ప్రసాదు, బీశెట్టి లక్ష్మీ, నేతలు జ్ఞాన సుందర రాజు, గద్దం భాస్కరరావు, పంజా జానకి రామయ్య, బొల్లంపల్లి శ్రీనివాస్‌చౌదరి, నూకల కనకారావు, వేగేశ్న వర్మ రాజు, నాగరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం


దిరుసుమర్రు గ్రామంలో ఇంటింటికి తిరిగి పథకాలు గురించి వివరిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్– నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నెరవేరని 600 హామీలు ఇచ్చి తీరా అధికారం వచ్చాక ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ప్రజా సమస్యలు తెలుసుకుని నవరత్నాలు రూపొందించి అధికారం చేపట్టిన నాటినుంచి ఇప్పటివరకు 98.5 శాతం పైగా హామీలను నెరవేర్చారని గుర్తు చేశారు. దీంతో ప్రతి కుటుంబానికి రూ. 50 వేలు నుంచి 5 లక్షలు వరకు లబ్ధి చేకూరిందన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ. 18వేల 750, కాపు మహిళలకు రూ. 15 వేలు, వాహన మిత్ర, నాయి బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులకు రూ 10 వేలు చొప్పున ఇచ్చి వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం జగనన్న తోడ్పాటునందించారన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వేటుకూరి రంగరాజు, ఎంపీటీసీ సభ్యులు కేతా నాగమణి, ఎన్. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకివీడులో గడపగడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 127వ రోజు సోమవారం పట్టణంలోని సచివాలయం-2లో ఐదవ వార్డులో జరుగనుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం విలేకరులకు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి పట్టణంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, నాయకులు హాజరవుతారన్నారు. మూడున్నర ఏళ్లలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు జరుపుతున్న పథకాలు ప్రజలకు అందుతున్న తీరును తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: మంచినీటికి బదులుగా ఎపొరపాటున కలుపుమందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన పెచ్చెట్టి గొల్లారావు, పోసమ్మ దంపతుల కుమారుడు వెంకటదుర్గాపవన్‌కుమార్ (25) ఉండి శివారు శ్రీరామపురంలో కూరగాయల సాగు చేసుకుని జీవిస్తున్నాడు. శనివారం పొలంలో పని చేస్తూ దాహంగా ఉందని అందుబాటులో ఉన్న బాటిల్‌లో ఉన్న నీటిని తాగాడు. అయితే అది పొలంలో కొట్టేందుకు తెచ్చిన కలుపు మందు అని తరువాత తెలుసుకున్నాడు. తరువాత అతనికి కడుపునొప్పి రాగా, దానిని పెద్దగా పట్టించుకోలేదు. మరికొంత సేపటికి నొప్పి తీవ్రం కావడంతో సోదరుడికి విషయాన్ని తెలియజేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయానికి పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఈస్టర్ పండుగ


ఉండిలో సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


మోగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ఈస్టర్ పండుగ ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు


గూట్లపాడులో సమాధుల వద్ద ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన క్రైస్తవులు

సాక్షి, భీమవరం: ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్మశానవాటికల్లో వారి వారి కుటుంబ సభ్యుల సమాధుల వద్ద రకరకాల కొవ్వొత్తులతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గీతాలాపనలు చేశారు. స్థానిక బేతనీ పేట చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలో పలు చోట్ల తెల్లవారుజామున ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పట్టా దేవరాజ్, డి.వర్గీస్ డేనియల్, విలియం కేరి, గంటా సుందర్‌కుమార్, డి.విజయ్‌కుమార్, పి.సుదర్శన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: క్రైస్తవులు అత్యంత పవిత్రంగా నిర్వహించే ఈస్టర్ పండుగ పర్వదినాన్ని ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.40 దినాల ఉపవాస ప్రార్థనల అనంతరం గుడ్‌ఫ్రైడే రోజున ఏసుక్రీస్తును శిలువ వేసి చంపడం నాటి నుండి మూడవ రోజున ఆయన తిరిగి బతికిన రోజునే క్రైస్తవులు ఈస్టరు పండుగగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని క్రైస్తవ శ్మశానాలను ఆయా సంఘాల ఆధ్వర్యంలో అత్యంత సుందరంగా వివిధ అలంకరణలతో తీర్చిదిద్దారు. ఉండి,ఎన్నార్పీ అగ్రహారం పేరిష్ పాస్టర్లు మానుకొండ ప్రసన్నకుమార్, వి.నెహ్రూ, పాస్టర్ డేవిడ్‌లివింగ్‌స్టన్ తదితరులు ప్రసంగిస్తూ పాపం చేసిన మనిషికి వచ్చేది మరణమని దానిని గెలిచి ఏసుప్రభువు తిరిగి లేచారని అన్నారు.

కాళ్లలో..

కాళ్ల: బైబిల్ లేఖనాల ప్రకారం క్రీస్తు చనిపోయి మూడోరోజైన ఆదివారం తిరిగి లేచినట్లు ఆయా చర్చిలో దైవజనులు తెలిపారు. గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈస్టర్ పర్వదిన సందర్భంగా మండలంలో అయ గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున సమాధులతోటలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలు డినామినేషన్లకు చెందిన చర్చిల్లో క్రీస్తు పునరుత్థానమైనట్లు తెలిపే పలు బైబిల్ లేఖనాలపై వాక్యోపదేశం చేశారు.

భీమవరంలో..

భీమవరం అర్బన్: సిలువపై మేకులతోను, ముళ్ల కిరీటంతో ఎన్నో కష్టాలు పడి సమాధి కాబడిన ఏసు క్రీస్తు పాపులను రక్షించేందుకు నేడు సజీవంగా లేచారని సీఆర్ కుర్రేళ్ల శ్యామ్యూయేలు అన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామంలో ఈస్టర్ సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్రేళ్ల శ్యామ్యూయేల్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ దైవ ఆరాధనతో ప్రార్థనలు చేస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఆ ప్రభువు చూపిస్తారన్నారు.

అనంతరం సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామునే సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు జరిపి పండ్లు ఫలహారాలు సమర్పించారు. అనంతరం గ్రామాల పురవీధుల్లో గీతాలు పాడుతూ క్రీస్తు నేడు లేచెను హల్లేలూయా అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మోగల్లు, పాలకోడేరు, మైప, కోరుకొల్లు, గరగపర్రు, గొల్లలకోడేరు , కుముదవల్లి, విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం, వేంద్ర కొండేపూడి తదితర గ్రామాల్లో చర్చిల్లో గీతాలు, ప్రార్థనలతో క్రీస్తుని ఆరాధించారు. ఈ సందర్భంగా యునైటెడ్ పాస్టర్లు అసోసియేషన్ మండల అధ్యక్షుడు, ఇవాంజెలిస్ట్ గోపే సాల్మన్‌రాజు మాట్లాడుతూ లేఖనాల ప్రకారం సర్వ మానవాళి పాపాల నిమిత్తం క్రీస్తు శ్రమపడి సిలువ వేసి మృతి చెంది మూడో రోజున లేచారన్నారు. దానినే క్రైస్తవులంతా ఈస్టర్ పండుగగా జరుపుకుంటున్నామని వివరించారు. అనంతరం పలు చర్చిల్లో కమిటీ వారు ఆధ్వర్యంలో ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, చిల్లా రత్నరాజు, ఎంపీటీసీ కాటూరి శాంతకుమారి, గోడి భూషణం, మైలా బత్తుల వెంకట్రావు,కేదాసి చిట్టిబాబు, గుర్రం డేవిడ్, పీసీసీ సభ్యులు కోనలపల్లి నాని, యు సంపత రావు, వి.నరసింహులు, బి.చిట్టిబాబు, పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: ఈస్టర్ సందర్భంగా మండలంలోని పలు చర్చిల వద్ద వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వడ్డిగూడెం మరనాత మహిమ సోషల్ వద్ద వీఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, సైదు శ్రీనివాసరావు, పి.సజీవరావు, పి.జీవరత్నం, చికెలే మంగతాయారు, గద్దం భారతి, గద్దం భాస్కర్ రావు, మానుకొండ ప్రదీప్ కుమార్, పాలమూరు బులిరాజు పాల్గొన్నారు

ఆకివీడులో..

ఆకివీడు సత్యం, ధర్మం ఎప్పుడూ బ్రతికే ఉంటాయని, ప్రకాశిస్తూనే ఉంటాయని, వాటిని అంతం చేసే శక్తి ఎవరికీ లేదని క్రీస్తు బోధనలు, క్రీస్తు జీవనం మానవాళికి గుర్తు చేస్తున్నాయని పాస్టర్ గూడపాటి జోసఫ్ రాజు అన్నారు. ఈస్టర్ సందర్భంగా స్థానిక వెలంపేటలోని దొరగారి చెరువు సమీపంలో ఉన్న సమాధుల వద్ద ప్రత్యేక పూజల్ని ఆదివారం తెల్లవారుజామున చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోని మధ్య ప్రాంతంలోని యెరుషలేంలో క్రీస్తు సమాధి నేటికీ తెరుచుకునే ఉందన్నారు. క్రీస్తు జననం, మరణం, పునరుత్థానం మానవ జాతికి మార్గదర్శకంగా నిలిచాయని జోసఫ్‌రాజు చెప్పారు. ఈస్టర్ సందర్భంగా పలు ప్రాంతాల్లోని సమాధుల వద్ద వారి బంధువులు ప్రత్యేక పూజలు చేశారు. సమాధుల్ని అలంకరించారు. బాణసంచా కాల్చారు. పండుగ వాతావరణం కల్పించారు. దీప కాంతులతో సమాధులు వెలుగొందాయి. సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు.

నిండు కుండలా మంచినీటి చెరువులు


నిండుకుండలా ఉన్న భుజబలరాయుడు మంచినీటి చెరువు

ఆకివీడు: వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా పట్టణంలోని అన్ని మంచినీటి చెరువుల్ని నిండు కుండలా నింపుతున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి ఆదివారం విలేకరులకు చెప్పారు. పట్టణంలోని ఆరు ప్రధాన మంచినీటి చెరువుల్లో నీరు నిండుగా ఉందన్నారు. వేసవి నీటి ఎద్దడిని తీర్చే గాలిబ్ చెరువు, సమ్మర్ స్టోరేజ్‌లతో పాటు భుజబలరాయుడు, ఆనాల చెరువు, ధర్మాపురంలోని మంచినీటి చెరువులన్నీ జలకళతో ఉన్నాయన్నారు. కాలువలు మరో 15 రోజులకు మూసివేసే అవకాశం ఉందని అయినప్పటికీ ముందుగానే నీటిని నింపామన్నారు. నీటి మట్టం తగ్గితే మరింత పెంచుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. జూన్ 20 వరకూ నీటి సమస్య పట్టణంలో తలెత్తే అవకాశం లేదన్నారు. అన్ని ప్రాంతాలకూ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని హైమావతి చెప్పారు. కుళాయిల ద్వారా నీరు సరఫరా కాని ప్రదేశాలకు అవసరమైతే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆమె చెప్పారు. గత పాలనలో ఒంటి పూట మాత్రమే కుళాయి నీరు సరఫరా చేసే వారని ఇప్పుడు ఆ సమస్యే లేదని హైమావతి చెప్పారు. నీటి సరఫరా పై నగర పంచాయతీ వాటర్ వర్క్స్ ఇంజినీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.

ఆకట్టుకున్న హరికథా సప్తాహం


శ్రీరామ సుగ్రీవ మైత్రి హరికథ సప్తాహం చెబుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక త్యాగరాజ భవనంలో చెరుకువాడ సోదరుల నిర్వహణలో హరికథ సప్తాహ మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు అదివారం హరికథ భాగవతరాణి పురాణం విజయలక్ష్మి (రాజమండ్రి) వారితో శ్రీరామ సుగ్రీవ మైత్రి హరికథ అద్భుతంగా ప్రదర్శించారు. సూర్పణకకు లక్ష్మణుడు చెవులు ముక్కులు కోయడం తన అన్న అయిన లంకాదీసుడు రావణాసురుడికి దగ్గరకు వెళ్లడం ఆయన ఆగ్రహించడం రాక్షసుడైన మారీచుడిని పిలిచి వారెవరో తెలుసుకో అనడం మారీచుడు వారు బ్రహ్మ ఋషులగా ఉన్నారని, చూడటానికి ఎదురు పడలేక పోయాయని చెప్పడం .. రావణుడు కోప్రొద్రుక్తుడై మారీచుడిని మాయ జింక రూపంలో వెళ్లి వారిని ఏమార్చమానడం .. ఆ ప్రకారం మారీచుడు ఈ రాక్షసుని చేతిలో చావడం కన్నా ఆ మహనీయుని చేతిలో మరణించడం గొప్ప భావించడం వంటి ఘట్టాలతో హరికథ చెప్పారు. ఈ హరికథలో సహ వాయిద్యకారులుగా పాలపర్తి అంజనేయులు (విజయవాడ), మృదంగంతో కాపవరపు సుబ్బారావు (భీమవరం) వయోలిన్‌తో సహకరించారు. ఈ కార్యక్రమాన్ని సాగి వితల్ రంగరాజు సహకారంతో నిర్వహించామని చెరుకువాడ సోదరులు తెలిపారు. ఏఎస్పీ సుబ్బరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు, తిరుపీధి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిడి నారాయణరావు పాల్గొన్నారు.

వీరవాసరంలో ధ్యాన శిక్షణ


వీరవాసరంలో ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: పట్టణంలోని శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన ఓషో పిరమిడ్ ధ్యాన ఆశ్రమం వ్యవస్థాపకులు సీనియర్ పిరమిడ్ మాస్టర్ బి.వి.వసంత్ పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందవచ్చునన్నారు. ప్రతిరోజూ ధ్యానసాధనతో పాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, వర్రె విశ్వేశ్వరరావు, సన్నిధి ఉదయ్, వీరవల్లి నరేష్, సత్యనారాయణ, తోలేటి శ్రీరామచంద్రమూర్తి, మంగతాయారు, ప్రభావతి, కృష్ణవేణి, శ్రీదేవి, పైడమ్మ తదితరులు పాల్గొని సామూహిక ధ్యానం చేశారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు


రాజ్యలక్ష్మీ అక్కయ్యను సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు: ఊరూరా రాములోరి కల్యాణంతో దేశం సుభిక్షంగా ఉంటుందని సహస్రనామ పారాయణ కర్త, గీతా మహిళా మండలి అధ్యక్షురాలు కె.రాజ్యలక్ష్మీ అక్కయ్య చెప్పారు. స్థానిక సంతపేటలోని కల్యాణ రామాలయంలో నవమి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామ చంద్రమూర్తులను తలుచుకుంటూ నవమి ఉత్సవాలు ఈ ఏడాది అత్యంత వైభవోపేతంగా నిర్వహించారని చెప్పారు. ధర్మం నాలుగు పాదాలపై నడుస్తుండడంతో దేశం ఎంతో సుభిక్షంగా ఉందని చెప్పారు. అనంతరం రాజ్యలక్ష్మీ అక్కయ్యను ఆలయ కమిటీ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు జగ్గురోతు విజయ్‌కుమార్, మోరా జ్యోతి, శ్రీనివాసరెడ్డి, కుంచాడ బాబ్జీ, అమర్, జంపన సుబ్రహ్మణ్యంరాజు(జేఎస్సార్), కోమటి రాంబాబు తదితరులు సత్కరించారు. అనంతరం అఖండ అన్నసమారాధన చేశారు. సుమారు 3 వేల మంది భక్తులు రాములోరి ప్రసాదం స్వీకరించారు.

వత్సవాయి భరద్వాజకు నివాళులు

సాక్షి, భీమవరం: ఉక్కు క్రమశిక్షణతో ప్రజా ఉద్యమాలు నిర్వహించటంలో అమరజీవి వత్సవాయి భరద్వాజ ప్రత్యేకత కలిగిన వ్యక్తిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. వత్సవాయి భరద్వాజ వర్ధంతి సభ భీమవరంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి వారు పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఎన్వీ గోపాలన్, జక్కంశెట్టి సత్యనారాయణ, డి.పెద్దిరాజు, వత్సవాయి సత్యవతి, వత్సవాయి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.